క్లుప్తంగా

రంజాన్ ఉపవాస దీక్షల క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి సబితారెడ్డి, నాయకులు

పహాడీషరీఫ్: రంజాన్ మాసం నమాజ్ వేళలతో ముద్రించిన క్యాలెండర్‌ను మంత్రి సబితారెడ్డి శుక్రవారం ఆవిష్కరించారు. జల్‌పల్లి మున్సిపాలిటీ బీఆర్‌ఎస్ నాయకులు రూపొందించిన ఈ క్యాలెండర్‌ను ఆమె తన నివాసంలో శుక్రవారం ఆవిష్కరించి రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. బీఆర్‌ఎస్ మున్సిపాలిటీ అధ్యక్షుడు ఎక్బాల్ బిన్ ఖలీఫా, బీఆర్‌ఎస్వీ అధ్యక్షుడు సయ్యద్ ఫెరోజ్ అహ్మద్, పర్వేజ్, మన్నాన్, జాఫర్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

కందుకూరు: మండల పరిధిలోని ఆకులమైలారంలో ఇటీవల అకాల మరణం చెందిన నోముల బుగ్గయ్య, నరసింహ, భిక్షపతి కుటుంబాలకు గ్రామానికి చెందిన అచ్చన శ్రీనివాస్ శుక్రవారం ఆర్థిక సహాయం అందించాడు. ఒక్కో కుటుంబానికి రూ.5 వేల నగదుతో పాటు 25 కిలోల చొప్పున బియ్యం పంపిణీ చేశాడు. ఆ కుటుంబాలకు అండగా ఉంటానని భరోసా కల్పించారు.

కార్యకర్తల అరెస్టు అన్యాయం: యూత్ కాంగ్రెస్

బడంగ్‌పేట్: రాహుల్ గాంధీకి రెండేళ్ల జైలు శిక్ష, పార్లమెంట్‌కు అనర్హత వేటు పడటంతో తట్టుకోలేని కాంగ్రెస్ నాయకులు నిరసన తెలుపుతుంటే దౌర్జన్యంగా అరెస్ట్ చేసి జైల్లో పెట్టడం దుర్మార్గపు చర్య అని యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు బోయపల్లి రాఘవేందర్‌రెడ్డి మండిపడ్డారు. రాహుల్‌కు మద్దతుగా శుక్రవారం నిరసన తెలుపున్న రాఘవేందర్ రెడ్డిని బలవంతంగా పోలీసులు నిర్బంధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాహుల్‌ను 8 ఏళ్లపాటు రాజకీయాలకు దూరం చేయడం దుర్మార్గపు ఆలోచన అన్నారు. వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో, దేశంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తంచేశారు.

రూ. 25.71 కోట్లతో మున్సిపల్ బడ్జెట్



మాట్లాడుతున్న మధుమోహన్

తుక్కుగూడ: మున్సిపాలిటీ అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని చైర్మన్ కే మధుమోహన్ అన్నారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో 2023–24 ఆర్థిక సంవత్సర వార్షిక బడ్జెట్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ సమావేశంలో రూ. 25.71 కోట్ల అంచనా బడ్జెట్‌ను ఆమోదించడం జరిగిందన్నారు. ఇందులో సీసీ రోడ్లు, డ్రైనేజీ పనుల కోసం రూ. 7.26 కోట్లు, సిబ్బంది వేతనాలకు రూ. 3.50 కోట్లు, గ్రీన్ బడ్జెట్ రూ. 1.63 కోట్లు, పారిశుద్ధ్య నిర్వహణకు రూ. 98 లక్షలు, పరిపాలన నిర్వహణకు రూ.2.09 కోట్లను వెచ్చించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కమిషనర్ వెంకట్రామ్, వైస్ చైర్మన్ భవాని, కౌన్సిలర్లు యాదగిరిరెడ్డి, శివకుమార్, మౌనిక, తేజస్విని, విలాస్, హేమలత, రవినాయక్, సుమన్, భావన, లావణ్య, రాజు, ఏఈఈ కె.భార్గవ్‌రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ వెంకటేష్, టీపీఎస్ వెంకటరఘునాథ్, జేఏఓ సుమతి సిబ్బంది పాల్గొన్నారు.

ఇళ్ల క్రమబద్ధీకరణలో సమస్యల పరిష్కారం: ఆర్డీఓ

హయత్‌నగర్: ప్రభుత్వ స్థలాల్లో నిర్మించిన ఇళ్లను క్రమబద్ధీకరించేందుకు తీసుకొచ్చిన జీఓ 59 ప్రకారం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు ఎదురవుతున్న సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని ఇబ్రహీంపట్నం ఆర్డీఓ వెంకటాచారి అన్నారు. హయత్‌నగర్ మండల పరిధిలో జీఓ 59 కింద దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు నోటీసులు ఇచ్చిన ప్రకారం రుసుము చెల్లించక పోవడంతో వారి సమస్యలను తెలుసుకునేందుకు శుక్రవారం ఆయన తహసీల్దార్ సంధ్యారాణితో కలిసి హయత్‌నగర్ తహసీల్దార్ లబ్ధిదారులతో సమావేశం అయ్యారు.

ఒక్క వాయిదా అయినా చెల్లించండి..

క్రమబద్ధీకరణకు మూడు విడతల్లో డబ్బులు కట్టాల్సి ఉందని అయితే ప్రస్తుతం ఒక విడత డబ్బులైనా చెల్లిస్తే వారికి ఎదురైన సమస్యలను పరిష్కరిస్తామని ఆర్డీఓ వెంకటాచారి తెలిపారు. ఎలాంటి రుసుమును చెల్లించకుండా సమస్యలు పరిష్కరించలేమని ఈ సంద్భంగా ఆయన స్పష్టం చేశారు. ఆయా సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. నోటీసులకు స్పందించకుంటే ఆక్రమణదారులుగా భావించి చట్టపరమైన చర్యలు తీసుకోల్సి వస్తుందని ఆర్డీఓ హెచ్చరించారు. ఆర్ఐ నర్సింహా పాల్గొన్నారు.

అడుగుకో గుంత



కార్పొరేషన్ కార్యాలయం నుంచి మంత్రాల చెరువు వెళ్లే ప్రధాన రహదారిపై గుంతలు

- మొక్కుబడి మరమ్మతులతోనే సరిపెడుతున్న వైనం
- ఇబ్బందులు పడుతున్న స్థానికులు, వాహనదారులు
- పట్టించుకోని అధికారులు

మీర్‌పేట: అడుగుకో గుంత.. ప్రతీసారి మరమ్మతులతోనే సరి.. అయినా పరిస్థితి మళ్లీ మొదటికే.. వివరాల్లోకి వెళితే. మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం నుంచి మంత్రాల చెరువు వైపు వెళ్లే ప్రధాన రహదారి పరిస్థితి అధ్వానంగా తయారైంది. దారి పొడవునా గుంతలు ఏర్పడడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఇదేదో కాలనీ అంతర్గత రోడ్డు కాదని, నిత్యం వందలాది వాహనాలు, కార్పొరేషన్ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు ఈ రూట్లోనే రాకపోకలు సాగిస్తుంటారని, అయినా ఏ ఒక్కరూ స్పందించడం లేదని స్థానికులు పేర్కొంటున్నారు. గత సంవత్సరం ఆగస్టులో ఈ రోడ్డుకు మరమ్మతు పనులు చేసిన కాంట్రాక్టర్ తూతూ మంత్రంగా ప్యాచ్‌లు వేసి చేతులు దులుపుకొన్నాడని, ప్యాచ్‌లు వేసిన కొన్ని రోజులకే రోడ్డు ధ్వంసమైందని స్థానిక కాలనీవాసులు తెలిపారు.

ప్యాచులతో మమ..!

మీర్‌పేట కూడలి నుంచి ఆర్‌సీఐ రోడ్డు, బాలాపూర్ చౌరస్తాకు చేరుకునేందుకు ప్రధాన రహదారి కావడంతో వాహనాల రాకపోకలు ఎక్కువగా ఉంటాయి. ప్రతిసారి అధికారులు మరమ్మతులు చేసి వదిలేస్తున్నారు తప్ప శాశ్వత పరిష్కారం చూపడం లేదని, మరమ్మతుల కోసం కాంట్రాక్టర్ల జేబులు నింపడం మినహా సమస్యకు పరిష్కారం లభించడం లేదని పరిసర కాలనీలవాసులు తెలిపారు. యంత్రాంగం స్పందించి ఇప్పటికైనా రహదారికి మరమ్మతులు చేయాలని కోరుతున్నారు.

విద్యార్థులకు పరీక్షా ప్యాడ్ల పంపిణీ

మహేశ్వరం: విద్యాభివృద్ధికి గడ్డం రంజిత్‌రెడ్డి సేవా సంస్థ నిరంతరం పనిచేస్తుందని బీఆర్‌ఎస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి రాఘవేందర్‌రెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని అమీర్‌పేట్, కోళ్లపడకల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో పదవ తరగతి పరీక్షలు రాయబోతున్న విద్యార్థులకు ఎంపి గడ్డం రంజిత్‌రెడ్డి సేవా సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం పరీక్షా ప్యాడ్స్ పంపిణీ చేశారు. విద్యార్థులకు అన్నివిధాలుగా అండగా ఉంటామన్నారు. పాఠశాలల అభివృద్ధికి సహకారం అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కోళ్లపడకల్ సర్పంచ్ నారాయణరెడ్డి, ఎంపీటీసీ చంద్రయ్య, అమీర్‌పేట్ ఎంపీటీసీ కుమారి రాయప్ప, ఉప సర్పంచులు నర్సింగ్,కుమార్, బీఆర్‌ఎస్ నాయకులు, ప్రధానోపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



పరీక్షా ప్యాడ్లు పంపిణీ చేసిన రాఘవేందర్‌రెడ్డి, నాయకులు

వడ్డెరుల సమస్యల పరిష్కారానికి కృషి



వడ్డెరుల జెండాను ఆవిష్కరిస్తున్న మేయర్ పారిజాత

మేయర్ పారిజాత

బడంగ్‌పేట్: వడ్డెర కులస్తులకు అండగా ఉండి వారి సమస్యలు పరిష్కరిస్తామని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, బడంగ్‌పేట మేయర్ పారిజాతరెడ్డి హామీ ఇచ్చారు. శుక్రవారం బడంగ్‌పేట కార్పొరేషన్ పరిధిలోని వడ్డెర సంఘం ఆధ్వర్యంలో జెండాను ఆవిష్కరించారు. బాలాపూర్, మల్లాపూర్, సుల్తాన్‌పూర్, బాలాజీనగర్ తదితర ప్రాంతాల్లో వడ్డెర సంఘాల జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. మొదటి నుంచి పోరాడుతున్న వడ్డెర కులస్థుల సమస్యలు పరిష్కరించి వారి సంక్షేమం కోసం పాటుపడతామని హామీ ఇచ్చారు. వడ్డెరులను ఎస్టీ జాబితాలో చేర్చాలని డిమాండ్ చేశారు. తెలంగాణలో వడ్డెర జాతులు పూర్తిగా వెనకబడ్డారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నర్సింహారెడ్డి, కార్పొరేటర్లు వీ ప్రభాకర్ రెడ్డి, బాలునాయక్, సుదర్శన్‌రెడ్డి, మాజీ సర్పంచ్ బీ జగన్‌రెడ్డి, జే శ్రీనివాస్‌యాదవ్, వడ్డెర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, చైర్మన్ సీ ఐలమల్లు, తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నాగేష్, బాలాపూర్ మండల అధ్యక్షుడు జీ యాదయ్య, వీ పెద్ద యాదయ్య, భీమయ్య, చిన్న యాదయ్య, మల్లేష్, వెంకటేష్, సత్యనారాయణ, అంజయ్య, నర్సింహా పాల్గొన్నారు.

దేశాభివృద్ధిలో పల్లెలు కీలకం

- ఎంపీపీ మంద జ్యోతి, జెడ్పీటీసీ బొక్క జంగారెడ్డి
- కందుకూరులో జాతీయ పంచాయతీ అవార్డుల ప్రదానోత్సవం

కందుకూరు: పంచాయతీలే దేశానికి పట్టుగొమ్మలని ఎంపీపీ మంద జ్యోతిపాండు, జెడ్పీటీసీ బొక్క జంగారెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిషత్ సమావేశపు హాల్‌లో ఎంపీడీఓ వెంకట్రాములు ఆధ్వర్యంలో జాతీయ పంచాయతీ అవార్డుల ప్రదానోత్సవ నిర్వహించారు. వివిధ కేటగిరీల్లో ఉత్తమ ప్రదర్శన కనబర్చిన జీపీలకు అవార్డులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. గ్రామాలు అభివృద్ధి చెందితే దేశం కూడా పురోగమిస్తుందన్నారు. ప్రభుత్వాలు అందిస్తున్న సహకారంతో సర్పంచులు, ఎంపీటీసీలు పోటీతత్వంతో తమతమ గ్రామాలను అభివృద్ధి బాట పట్టించాలని సూచించారు. వైస్ ఎంపీపీ శమంతప్రభాకర్‌రెడ్డి, ఎంపీఓ విజయలక్ష్మి, ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

అవార్డులు అందుకున్న పంచాయతీలు

- మహిళా స్నేహపూర్వక పంచాయతీలుగా దెబ్బడగూడ, కొత్తూర్, జైత్వారం.
- ఆరోగ్యకరమైన గ్రామాలుగా అన్నోజిగూడ, గుమ్మడవెల్లి, పెద్దమ్మతండా.
- పేదరికం లేని మెరుగైన జీవనోపాధి కలిగిన జీపీలుగా కటికపల్లి, మాదాపూర్, జబ్బార్‌గూడ.
- తగినంత నీరు మరియు చిన్న పిల్లలతో స్నేహపూర్వకంగా ఉన్న పంచాయతీగా కొత్తగూడ.
- చిన్నారులతో స్నేహ పూర్వక పంచాయతీగా లేమూరు.
- నీరు తగినంత ఉన్న పంచాయతీలుగా చిప్పలపల్లి, తిమ్మాపూర్.
- శుభత, పచ్చదనం కలిగిన జీపీలుగా అగర్‌మియాగూడ, దావూద్‌గూడతండా, ముచ్చర్ల.
- స్వయం సమృద్ధి, మౌలిక సదుపాయాలతో కూడిన గ్రామాలు దాసర్లపల్లి, మీర్‌ఖాన్‌పేట, సార్లరావులపల్లి.
- సామాజిక భద్రత కలిగిన గ్రామాలుగా ఆకులమైలారం, కందుకూరు, నేదునూరు.
- సుపరిపాలన అందిస్తున్న జీపీలుగా ధన్నారం, రాచులూరు, సరస్వతీగూడ.



జాతీయ పంచాయతీ అవార్డులు అందుకున్న మహిళా సర్పంచులు



అవార్డులు అందజేస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ తదితరులు



కందుకూరు: సర్పంచ్‌లకు అవార్డులు అందిస్తున్న అతిథులు

ఏ ఆపద వచ్చినా అండగా ఉంటా

విద్యాశాఖమంత్రి సబితారెడ్డి

- రూ. 1.04 కోట్లతో అభివృద్ధి పనులు ప్రారంభం

బడంగ్‌పేట్: ప్రజలు ఎలాంటి సమస్యలున్నా తన దృష్టికి తీసుకురావాలని విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి అన్నారు. శుక్రవారం బడంగ్‌పేట్ కార్పొరేషన్ పరిధిలోని 18వ డివిజన్‌లోని సాయిప్రభు కాలనీలో రూ.30 లక్షల వ్యయంతో వరద నీటి పైప్‌లైన్ పనులు, సీపీఎస్ఆర్ టౌన్‌షిప్ నుంచి బాలాజీ టౌన్‌షిప్ వరకు రూ.40 లక్షలతో వేయనున్న ఓపెన్ డ్రైన్ నిర్మాణ పనులకు, సాయినగర్ కాలనీలో రూ.22 లక్షలతో సీసీ రోడ్డు పనులు, సాయిగణేష్ కాలనీలో రూ.12 లక్షలతో సీసీ రోడ్డు పనులను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అందరి మన్ననలతో మహేశ్వరం నియోజకవర్గంతో పాటు బడంగ్‌పేట కార్పొరేషన్‌ను అన్ని విధాలా అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. వర్షాలు, వరదలు రాకముందే ఓపెన్ నాలాల (ఎస్ఎన్‌డీపీ) పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. మహేశ్వరం నియోజకవర్గంలో అభివృద్ధి జరగడం లేదని అంటున్న విపక్షాల మాటలను నమ్మవద్దని కోరారు. బడంగ్‌పేట కార్పొరేషన్‌లోనే రూ.200 కోట్లు వెచ్చించి అభివృద్ధి చేశామని ఆమె వివరించారు. రోడ్ల వెడల్పుతో పాటు వరదలకు ఏ కాలనీలు మునిగిపోకుండా ఎస్ఎన్‌డీపీ పథకం ద్వారా శాశ్వత పరిష్కారం చూపే ప్రణాళికలు రూపొందించామని తెలిపారు. ఏ కష్టం వచ్చినా తాను అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మేయర్ పారిజాత, డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్, కార్పొరేటర్లు, భారతమ్మ, బండారి మనోహర్, బాలునాయక్, మాజీ సర్పంచ్ జగన్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్ గణేశ్ పాల్గొన్నారు.



అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న సబితారెడ్డి

అక్రమ అరెస్టులతో మా బలగాన్ని ఆపలేరు

యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు రాఘవేందర్‌రెడ్డి

బడంగ్‌పేట్: రాహుల్ గాంధీకి రెండెళ్ల జైలు శిక్ష, పార్లమెంట్‌కు అనర్హత వేటు పడడంతో తట్టుకోలేని కాంగ్రెస్ నాయకులు నిరసన తెలుపుతుంటే దౌర్జన్యంగా అరెస్ట్ చేసి జైల్లో పెట్టడం దుర్మార్గపు చర్యగా యూత్ కాంగ్రెస్ మహేశ్వరం నియోజకవర్గం అధ్యక్షుడు బీ రాఘవేందర్‌రెడ్డి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలపై విరుచుకు పడ్డారు. శుక్రవారం రాహుల్‌కు మద్దతుగా నిరసన తెలుపుతున్న రాఘవేందర్‌రెడ్డిని బలవంతంగా పోలీసులు నిర్బంధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భారత దేశానికి రెండు సార్లు ప్రధాని అవకాశం వచ్చినా సున్నితంగా తిరస్కరించిన గొప్ప దేశ భక్తుడు రాహుల్ గాంధీ అని అన్నారు. నాటి ప్రధానులు ఇందిరా గాంధీ, రాజీవ్‌గాంధీలు దేశం కోసం ప్రాణ త్యాగం చేసిన గొప్ప వీరుల కుటుంబం నుంచి వచ్చిన రాహుల్‌ను 8 ఏళ్లపాటు రాజకీయాలకు దూరం చేయడం దుర్మార్గపు ఆలోచన అని అన్నారు. కాంగ్రెస్‌ను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం, రాష్ట్రంలోని బీఆర్‌ఎస్ ప్రభుత్వాలు ఆపలేరని పేర్కొన్నారు. అటు కేంద్రంలో, ఇటు రాష్ట్రంలో కాంగ్రెస్ జెండాను ఎగురవేయడం ఖాయమన్నారు.



రాఘవేందర్‌రెడ్డిని అరెస్టు చేస్తున్న పోలీసులు

హబీబుల్లాగూడలో కంటివెలుగు శిబిరం

మహేశ్వరం: మండల పరిధిలోని హబీబుల్లాగూడ గ్రామంలో కంటి వెలుగు శిబిరాన్ని ఎంపీపీ రఘుమారెడ్డి శుక్రవారం ప్రారంభించారు. శిబిరంలో మొత్తం 127 మంది కంటి పరీక్షలు చేయగా 20 మందికి అద్దాలను పంపిణీ చేశారు. 5 మందికి కంటి ఆపరేషన్ చేయాలని గుర్తించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ నర్సింహ, హబీబుల్లాగూడ గ్రామ సర్పంచ్ శైలజ, గొల్లూరు ఎంపీటీసీ సభ్యులు రమేష్, బీజేపీ సీనియర్ నాయకులు శ్రీనివాస్, మెడికల్ అధికారి డా.సౌమ్య, ఆప్టోమెట్రిస్ట్ ప్రభావతి, హెచ్ఈఓ నర్సింహ స్వామి, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

వెంకన్న హుండీ ఆదాయం రూ.1,32,774

మీర్‌పేట: కార్పొరేషన్ పరిధిలోని జిల్లెలగూడలో శ్రీ మత్స్యావతార వేంకటేశ్వర స్వామి దేవాలయ హుండీ లెక్కింపును శుక్రవారం నిర్వహించారు. జనవరి 3వ తేదీ నుంచి మార్చి 24 వరకు 1 లక్షా 32 వేల 774 రూపాయల ఆదాయం వచ్చినట్లు ఈఓ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. లెక్కింపు కార్యక్రమంలో దేవాదాయ శాఖ ఇన్‌చార్జి శ్రవణ్‌కుమార్, కార్పొరేటర్ బొక్క రాజేందర్‌రెడ్డి, అర్చకులు రామాచారి, మాజీ ధర్మకర్త జంగారెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

శివగంగ ఆలయానికి భక్తుల తాకిడి

మహేశ్వరం: శివగంగ రాజరాజేశ్వర ఆలయంలో శుక్రవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం రాజేశ్వరీ దేవి అమ్మవారికి అభిషేకం, కుంకుమార్చన, మంత్ర పుష్పం, పుష్పాలంకరణతో పాటు పలు పూజలు నిర్వహించారు. శివుడికి పూలతో అభిషేకం, పంచామృతాభిషేకం చేశారు.అమ్మవారు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ కమిటీ చైర్మన్ సుధీర్ గౌడ్, ఆలయ డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

సభ ఏర్పాట్ల పరిశీలన

అబ్దుల్లాపూర్‌మెట్: బీఆర్‌ఎస్ పార్టీ యువనేత మంచిరెడ్డి ప్రశాంత్‌కుమార్ రెడ్డి 63 రోజులపాటు చేపట్టిన పాదయాత్ర ముగిసింది. పాదయాత్ర ముగింపు సందర్భంగా శనివారం పెద్దఅంబర్‌పేట ఔటర్ రింగ్ రోడ్డు కూడలిలో నియోజకవర్గస్థాయి బహిరంగ సభ నిర్వహించనున్నారు. ఈ సభకు మంత్రి కేటీఆర్‌తో పాటు బీఆర్‌ఎస్ ప్రముఖులు హాజరు కానుండటంతో సభ ఏర్పాట్లను శుక్రవారం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి పర్యవేక్షించారు. 20 వేలకు పైగా ప్రజలను సమీకరించేందుకు చర్యలు తీసుకోవాల్సిందిగా పార్టీ శ్రేణులకు మంచిరెడ్డి పిలుపునిచ్చారు. సభకు వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేస్తున్నామని ప్రశాంత్‌కుమార్‌రెడ్డి తెలిపారు.

భూగర్భ జలాలను సంరక్షించుకోవాలి

మీర్‌పేట: భూగర్భ జలాలను సంరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి పౌరుడిపై ఉందని లార్డ్స్ విద్యాసంస్థల చైర్మన్ సిద్దాల బీరప్ప తెలిపారు. ప్రపంచ జల దినోత్సవాన్ని పురస్కరించుకుని గాయత్రి ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లెలగూడ లార్డ్స్ పాఠశాలలో నీటి వినియోగంపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా బీరప్ప మాట్లాడుతూ.. ప్రతి నీటి బొట్టును ఒడిసి పట్టి ఇంకుడు గుంతల ద్వారా భూగర్భ జలాలను పెంపొందించి భావి తరాలకు అందించాలని పిలుపునిచ్చారు. అనంతరం నీటిని వృథా చేయకుండా కాపాడుతామని విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో జలమండలి జీఎం శ్రీనివాస్‌రెడ్డి, డీజీఎం హరీశ్‌కుమార్, జీఎం ప్రమోద్‌రెడ్డి, గాయత్రి ఫౌండేషన్ అధ్యక్షులు రవికుమార్, కో ఆర్డినేటర్ స్వాతి, హర్షవర్ధన్, పాఠశాల డైరెక్టర్ సిద్దాల శ్రీలత, ప్రిన్సిపాల్ సతీష్ కుమార్ పాల్గొన్నారు.



అవగాహన సదస్సులో పాల్గొన్న చైర్మన్ సిద్దాల బీరప్ప తదితరులు

చిరుధాన్యాలపై అవగాహన

తలకొండపల్లి: మండల పరిధిలోని రాంపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పోషణ అభియాన్‌లో భాగంగా చిరుధాన్యాలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. చిరుధాన్యాలు ఆహారంగా తీసుకోవడం వల్ల శరీరానికి కావాల్సిన రోజువారీ పోషకాలన్నీ లభిస్తాయన్నారు. ఎదిగే పిల్లలకు చిరుధాన్యాలు ఇవ్వడంతో వారిలో పోషకాహార లోపం తొలగిపోయి శారీరక ఎదుగుదల వేగంగా ఉండే అవకాశాలుంటాయన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ శ్యాంసుందర్‌రెడ్డి, ఉప సర్పంచ్ మోహన్‌రెడ్డి, సూపర్‌వైజర్ తిరుమల, టీచర్ పద్మ, వెంకటయ్య, పవన్, నవనీత పాల్గొన్నారు.

మంగళ్‌పల్లి అంగన్‌వాడీ కేంద్రంలో..

ఇబ్రహీంపట్నం రూరల్: చిరుధాన్యాలు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని ఇబ్రహీంపట్నం ఐసీడీఎస్ సీడీపీఓ శాంతిశ్రీ తెలిపారు. పోషణ పక్వాడా కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఆదిబట్ల మున్సిపాలిటీలోని మంగళ్‌పల్లి అంగన్‌వాడీ కేంద్రంలో సీడీపీఓ ఆధ్వర్యంలో పోషణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అంగన్‌వాడీ సూపర్ వైజర్ సరళ, అంగన్‌వాడీ టీచర్ మల్లమ్మ, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు .

చిరుధాన్యాలతో అధిక పోషకాలు..

మంచాల: చిరు ధాన్యాల్లో అధిక పోషకాలు ఉంటాయని మంచాల జెడ్పీటీసీ మర్రి నిత్యారెడ్డి, జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈఓ రంగారావు అన్నారు. శుక్రవారం మంచాల మండల కార్యాలయంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో చిరుధాన్యాలతో చేసిన ఆహార పదార్థాల ప్రదర్శనను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాస్, ఎంపీఓ తేజ్ సింగ్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు పల్లవి, కల్పన, వివిధ గ్రామాలకు చెందిన ప్రజాప్రతినిధులు, అంగన్‌వాడీటీచర్లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



మంచాల: ప్రదర్శనను తిలకిస్తున్న నాయకులు, అధికారులు

క్రీడలతో మానసికోల్లాసం

మాజీ ఎంపీపీ శ్రీనివాస్‌గౌడ్

తుక్కుగూడ: క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని మహేశ్వరం మాజీ ఎంపీపీ ఎం.శ్రీనివాస్‌గౌడ్ పేర్కొన్నారు. శుక్రవారం తుక్కుగూడ మాజీ సర్పంచ్ ముప్పిడి నారాయణగౌడ్ జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన టీపీఎల్ (తుక్కుగూడ ప్రీమియర్ లీగ్) ఏడో సెషన్ క్రికెట్ పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...గ్రామస్థాయిలో నిర్వహించే పోటీల ద్వారా యువతలో దాగి ఉన్న క్రీడా ప్రతిభ బయటపడుతుందన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు రాజమౌని రాజు, లావణ్య, నాయకులు నర్సింహ, సురేష్, శ్రీనివాస్, ప్రభాకర్, శంకరయ్య, బాలారాజ్, హరినాథ్, హేమంత్, వెంకటరమణ, శేఖర్‌రెడ్డి, చిన్నారెడ్డి, క్రీడాకారులు, తదితరులు పాల్గొన్నారు.



తుక్కుగూడలో క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న మాజీ ఎంపీపీ శ్రీనివాస్‌గౌడ్